
మనం
కడప | అన్నమయ్య


## నాగినేని రాంప్రసాద్ నాయుడు మృతి టీడీపీకి తీరని లోటు





పెనగలూరు(జూన్ 25),మనంన్యూస్: పెనగలూరు మండలం తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడు నాగినేని రాంప్రసాద్ నాయుడు అకాల మృతి తీరని లోటు అని టీడీపీ మాజీ మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపిటిసి కొత్త బాలకృష్ణ, నాయకులు అభిప్రాయ పడ్డారు. గురువారం ఉదయం గుండె పోటుతో నాగినేని రాంప్రసాద్ నాయుడు మృతి చెందారు. జిల్లా తెలుగు యువత కార్యదర్శి గ, యూనిట్ ఇంచార్జీ గ ఉత్తమ సేవలు అందించినట్లు చెప్పారు. పార్టీ అభివృద్ధి కి నిబద్ధతతో పని చేసిన నాయకుడు రాంప్రసాద్ నాయుడు అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రైల్వే కోడూరు టీడీపీ ఇంచార్జీ ముక్కా రూపానంద రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన నాయకుడు తాతంశెట్టి నాగేంద్ర, టీడీపీ నాయకుడు బిఎల్ నరసింహ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎంజర్ల నారాయణ రెడ్డి, మైనార్టీ నాయకుడు షామీర్ బాషా మృత దేహాన్ని సందర్శించి తమ ఘన నివాళి అర్పించారు.

# రాజంపేట నియోజకవర్గంలో ముమ్మరంగా సాగుతున్న 'ఎస్.ఐ.ఆర్' పరిశీలన










## శ్రేణులకు చమర్తి జగన్ మోహన్ రాజు దిశానిర్దేశం

రాజంపేట మనం న్యూస్ జూన్ 25 రాజంపేట నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను మరింత పటిష్టం చేసే దిశగా తెలుగుదేశం పార్టీ ముమ్మర చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు , నియోజకవర్గ పార్టీ అబ్జర్వర్ శ్రీ భీమినేని చిట్టిబాబు గారితో కలిసి గురువారం సిద్ధవటం, ఒంటిమిట్ట, నందలూరు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఎస్.ఐ.ఆర్ విధానాన్ని పరిశీలించిన అనంతరం, వారు ఆయా మండలాల అధ్యక్షులు, క్లస్టర్ మరియు యూనిట్ ఇన్‌చార్జీలతో ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో ఓటర్ల జాబితా సవరణ అత్యంత కీలకమైనదని, క్షేత్రస్థాయి నాయకులు సమన్వ యంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఈ సందర్భంగా నాయకు లకు దిశానిర్దేశం చేశారు.ఈ పర్యటనలో చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ.. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం నిర్వహణలో పార్టీ శ్రేణులు ఎలాంటి అలసత్వాన్ని వహించరాదని స్పష్టం చేశారు. ప్రతి ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. ముఖ్యంగా బూత్ స్థాయిలో పార్టీ బలానికి పునాది అయిన ప్రతి 'బూత్ లెవెల్ ఏజెంట్' (బీఎల్ఏ) ఈ ప్రక్రియలో తప్పనిసరిగా, చురుగ్గా పాల్గొనాలని ఆయన ఆదేశించారు. క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు నిరంతరం బూత్ స్థాయి ఏజెంట్లను సమన్వయం చేసుకుంటూ.. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం ఒంటిమిట్ట నందలూరు కి సంబంధించిన తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సభాస్థలి, హెలిపాడ్ ప్రాంగణాన్ని పరిశీలించిన జిల్లా టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జిల్లా అధికారులు






ఓబులవారిపల్లి, జూన్ 25, మనం న్యూస్ : తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని ఓబుల వారిపల్లి మండలం ముక్కవారిపల్లి పంచాయతీ మంగంపేట వద్ద జులై రెండవ తేదీ అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగబోయే వి బి రాంజీ గ్రామీణ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా విచ్చేయుచున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం వర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ కేంద్ర గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రివర్యులు శివరాజ్ సింగ్‌చౌహాన్ విచ్చేయుచున్న నేపథ్యంలో రెండు రోజులుగా పనులు పరుగులు పెడుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం రైల్వేకోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్, కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆర్డీవో రామ్మోహన్, డి.ఎస్.పి వై శ్రీనివాస్‌రావులు సంయుక్తంగా కలిసి సభ జరిగే ప్రదేశం మరియు హెలి పాడ్, బస్సు పార్కింగ్‌కి సంబంధించి స్థలం చూసి ఎలా ఏర్పాటు చేయాలి ఏంటి అనే విషయాలను చర్చించు కోవడం జరిగింది. అంతేకాకుండా మంగంపేటకు సంబంధించి బ్లూ ప్రింట్ ద్వారా సభకు విచ్చేసేటటువంటి వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టి సభను విజయవంతం చేసే విధంగా కృషి చేస్తున్నారు. వీరితోపాటు ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.







## నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు

రాజంపేట జూన్ 25 (మనం న్యూస్)

పోలి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్, గ్రామ కమిటీ చైర్మన్ పసుపులేటి పెంచలయ్య కుమార్తె నిశ్చితార్థ వేడుకలు స్థానిక సంఘరాజు కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ శుభకార్యానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాస రాజు గారు, నూతన వధూవరులను ఆశీర్వదించి వారి జీవితంలో ఆనందం, ఐశ్వర్యం, సుఖశాంతులు నెలకొనాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి, పెంచలయ్య గారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పోలి సుబ్బారెడ్డి, పలువురు ప్రముఖ రాజకీయ నాయకులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, హోలీ గ్రామ ప్రజలు, అభిమానులు మరియు కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.










# ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు దొంగతనం కేసుల ఛేదన

## ముగ్గురు నిందితుల అరెస్ట్, మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగింపు

## సుమారు రూ.18.70 లక్షల విలువైన 170 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం

రైల్వే కోడూరు, జూన్ 25, మనం న్యూస్: తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన రెండు దొంగతనం కేసులను పోలీసులు విజయవంతంగా ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి సుమారు రూ.18.70 లక్షల విలువైన 170 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఓబులవారి పల్లి మండలం వై.కోట పంచాయతీ పరిధిలోని యద్దలవారిపల్లి గ్రామానికి చెందిన యన్నారు అనంతమ్మ తన అన్న యద్దల ఈశ్వరయ్య నివాసంలోని బీరువాలో భద్రపరిచిన సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. అలాగే అదే గ్రామానికి చెందిన యద్దల మౌనిక తన నివాసంలోని కబోర్డులో భద్రపరిచిన సుమారు 9 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఘటనల్లో కలిపి సుమారు 19 తులాల బంగారు ఆభరణాలు, దాదాపు రూ.20.90 లక్షల విలువైన ఆస్తి దొంగిలించబడినట్లు గుర్తించి పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో, రేణిగుంట ఎస్‌డీపీఓ వై. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం ఏర్పాటు చేయబడింది. దర్యాప్తులో భాగంగా సేకరించిన సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారంతో 25-06-2026 తేదీన వై.కోట - ఎద్దులవారిపల్లి మార్గంలోని మూడు రోడ్ల కూడలి వద్ద ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొండేటి జ్యోతి ప్రకాష్ అలియాస్ పవన్ (19), ఉమ్మక శివ మనోజ్ అలియాస్ మనోజ్ (19), నందలూరు కౌశిక్ కుమార్ రెడ్డి అలియాస్ కౌశిక్ (20) నిందితులను విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించడంతో వారి వద్ద నుంచి సుమారు 170 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో యన్నారు అనంతమ్మకు చెందిన 10 తులాల బంగారు ఆభరణాలు, యద్దల మౌనికకు చెందిన 7 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. మరో నిందితుడు ఎద్దుల అఖిల్ వర్ధన్ అలియాస్ అఖిల్ పరారీలో ఉండగా, అతని అరెస్టు కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. ఈ కేసును ఛేదనలో రైల్వే కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు, ఓబులవారిపల్లి ఎస్ఐ కె. సుజన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ జి. వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది వి. బ్రహ్మానంద రెడ్డి, బి. కార్తీక్ కుమార్ మరియు వి. వెంకటయ్యలు పాల్గొన్నారు.

# ఓటర్ల వెరిఫికేషన్ పారదర్శకంగా ఉండాలి




సిద్ధవటం, జూన్ 25: గ్రామాలు, పట్టణాలు, వివిధ ప్రాంతాల్లో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల వెరిఫికేషన్ (పరిశీలన) పారదర్శకంగా ఉండాలని తెలుగు యువత మండల అధ్యక్షుడు పుత్తా సుధీర్ రాయల్ తెలిపారు. గురువారం భాకరాపేటలో ఆయన మాట్లాడుతూ, ప్రతి కుటుంబంలోని సభ్యులు తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయా లేదా అన్న విషయాన్ని పరిశీలించుకోవడంతో పాటు, వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరిదిద్దుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేరు లేకపోవడం, చిరునామా లేదా ఇతర వివరాల్లో పొరపాట్లు ఉండడం వంటి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. జూలై 14వ తేదీ వరకు కొనసాగనున్న ఈ వెరిఫికేషన్ ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటర్ల జాబితా ఎంతో అవసరమని పేర్కొన్నారు. దొంగ ఓట్లకు అవకాశం లేకుండా, ఒకే వ్యక్తి పేరుతో రెండు లేదా మూడు ప్రాంతాల్లో ఓట్లు నమోదు కాకుండా అధికారులు కఠినంగా పరిశీలన నిర్వహించాలని సుధీర్ రాయల్ సూచించారు. అలాగే మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి వివరాలను సరైన ఆధారాలతో పరిశీలించి ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని అన్నారు. దీనివల్ల ఎన్నికల ప్రక్రియ మరింత పారదర్శకంగా, నిష్పాక్షికంగా కొనసాగుతుందని తెలిపారు. స్థానికంగా ఇళ్లు ఉండి ఉద్యోగాలు, వ్యాపారాలు లేదా ఇతర కారణాలతో బయట ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబ సభ్యులకు కూడా ఈ కార్యక్రమంపై సమాచారం అందించాలని ఆయన సూచించారు. ప్రతి అర్హత కలిగిన వ్యక్తి ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకునేలా కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఓటు అనేది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని, ఆ హక్కు ద్వారా ప్రభుత్వాలను ఎన్నుకోవడంతో పాటు సమాజంలో మార్పును తీసుకురావచ్చని సుధీర్ రాయల్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడు తన బాధ్యతను నిర్వర్తించాలని, ముఖ్యంగా యువత కొత్త ఓటర్లుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ ఓటర్ల వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొని తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# పీఎం స్వనిధి కింద మైదుకూరులో 157 మంది వీధి విక్రయదారులకు రూ.23.55 లక్షల రుణాలు మంజూరు










మైదుకూరు, జూన్ 25, మనం న్యూస్: కడప జిల్లా మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో పీఎం స్వనిధి పథకం కింద 2026-27 సంవత్సరానికి గాను 157 మంది వీధి విక్రయదారులకు రూ.23,55,000 రుణాలు మంజూరయ్యాయి. మైదుకూరు పట్టణంలో 273 మంది వీధి విక్రయదారులను ఎన్‌రోల్‌మెంట్ చేయగా, వారిలో 157 మందికి ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున బ్యాంకుల నుండి లోన్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. "లోక కళ్యాణ మేళా" కార్యక్రమంలో భాగంగా మంజూరైన రుణ మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో మున్సిపల్ కమిషనర్ వై. రంగస్వామి లబ్ధిదారులకు అందజేశారు. వీధి విక్రయదారులు అంటే: ఉదయం 6 నుంచి సాయంత్రం 7 వరకు మున్సిపాలిటీ పరిధిలో తోపుడు బండ్లు, ఫుట్‌పాత్‌పై గంపలు, తలపై పెట్టుకొని చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేవారు. స్థిరంగా షాపులు పెట్టుకొని బాడుగ చెల్లించి వ్యాపారం చేసేవారు వీధి విక్రయదారుల పరిధిలోకి రారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఎస్‌బీఐ మైదుకూరు బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ జాహ్నవి, యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ హనుమాన్ నాయక్, మెప్మా సీఎంఎం కేజీయజాస్లీన్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు వై. పెద్ద పుల్లయ్య, ఎన్. హేమలత, వి. నాగలక్ష్మి, టీఎల్‌ఎఫ్ ఓబీ, ఆర్పీలు, ఎస్-ఎల్‌ఎఫ్ ఆర్పీలు, వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

## రాజంపేట పార్లమెంట్ అబ్జర్వర్ కమిటీ సభ్యులుగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు మాదాసు నరసింహ





చిట్వేలి జూన్ 25 మనం న్యూస్ ప్రతినిధి: తిరుపతి జిల్లా చిట్వేలి మండలం జనసేన పార్టీ సంస్థాగత కమిటీ నియామకాలలో భాగంగా ప్రతి పార్లమెంటుకు సమన్వయ కమిటీని నియమించడం జరిగింది. రాజంపేట పార్లమెంట్ సమన్వయ కమిటీ అబ్జర్వర్ గా జనసేన పార్టీ సీనియర్ నాయకులు కళ్యాణ శ్రీనివాసరావు (కేకే) నీ నియమించారు. రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ బలోపేతానికి ఆయన అధ్యక్షతన ఒక కమిటీ వేయడం జరిగింది ఆ కమిటీలో చిట్వేలి మండలం నుండి జనసేన పార్టీ సీనియర్ నాయకులు పార్టీ పుట్టినప్పటి నుండి జనసేన జెండా మోసిన వ్యక్తికి పదవి రావడం పట్ల చిట్వేలి మండలంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మాదాసు నరసింహ మాట్లాడుతూ తమ నాయకుడు తమ మీద నమ్మకం ఉంచి రాజంపేట పార్లమెంటరీ అబ్జర్వర్ కమిటీలో మెంబర్గా నియమించడం పట్ల పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే కళ్యాణి శ్రీనివాసరావు అలియాస్ కేకే అధ్యక్షతన రాజంపేట పార్లమెంటులో జనసేన పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఆయన తెలియజేయడం జరిగింది. పార్టీ తన పైన ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయమని పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకెళ్లడం జరుగుతుందని పార్టీ పుట్టినప్పటి నుండి పార్టీ కోసం అహర్నిశలా కష్టపడి నా ప్రతి ఒక్కరికి సరైన న్యాయం జరిగే విధంగా కృషి చేయడం జరుగుతుందని. అలాగే కొత్తవారిని పార్టీలోకి ఆహ్వానించి పార్టీ బలోపేతానికి కృషి చేయడం కూడా జరుగుతుందని తెలియజేయడం జరిగింది. చిట్వేలీ మండలంలోని జనసేన పార్టీ కార్యకర్తలు, వీర మహిళలు, పవన్ కళ్యాణ్ అభిమానులు మాదాసు నరసింహకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులుగా సుధాకర్



ముద్దనూరు, జూన్,25,(మనం న్యూస్ ): జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులుగా ( రూరల్)ముద్దనూరు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ అధ్యక్షులు కొప్పారపు వెంకట సుధాకర్ ను గురువారం జిల్లా అధ్యక్షులు వల్లంపండు వెంకటరమణ నియమించి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి టీవీ నాగేశ్వరరావు చంద్రశేఖర్ వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఎలిసెట్టి ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి మండలంలో ఆర్యవైశ్య సంఘం కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయకమిటీసభ్యులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల పర్యవేక్షణకు దూరంగా విద్యాశాఖ అధికారులు



చిట్వేలీ జూన్ 25 మనం న్యూస్ ప్రతినిధి: చిట్వేలి మండల కేంద్రంలో ఉన్న ప్రైవేటు పాఠశాలల తీరు పట్ల మండల వ్యాప్తంగా విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల సదుపాయాలతో విద్యాబోధన జరుగుతుంటే ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం సదుపాయాలు పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందుబాటులో లేవని ముఖ్యంగా లైబ్రరీ, ల్యాబ్లు, క్వాలిఫై టీచర్లు, ఆటస్థలం ఇలాంటివి ఒకటి రెండు పాఠశాలలో మాత్రమే మాత్రమే ఉన్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుండి చేరడం జరిగింది వారికి టి సి ఇచ్చే వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. తల్లిదండ్రులు ఎవరైనా టీసీలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇవ్వకపోతే మండల విద్యాశాఖ అధికారులను సంప్రదించవచ్చునని విద్యాశాఖ అధికారులు తెలియజేశారు. కచ్చితంగా తల్లిదండ్రులను వారి పిల్లలు ఎక్కడ పాఠశాలలో చదివించుకోవాలన్నది వారికి పూర్తి స్వేచ్ఛ ఉందని ఎవరైనా టిసి ఇవ్వనట్లు తమ దృష్టికి వచ్చితే శాఖపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## రెండవ రోజు చంద్రప్రభ వాహనం మీద భక్తులకు దర్శనమిచ్చిన స్వామి అమ్మవార్లు

చిట్వేలి జూన్ 25 మనం న్యూస్ ప్రతినిధి: మండల కేంద్రంలోని కంసముద్రం పంచాయతీ కే.ఎస్ అగ్రహారం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ భూనీల సమేత వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు రెండవ రోజు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం రెండవ రోజు ఉదయం - తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం భక్తులు ఉండడం వైభవంగా నిర్వహించారు. అనంతరం రాత్రి చంద్రప్రభ వాహనం మీద స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని పునీతులయ్యారు.

